క్లుప్తంగా

చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో బుధవారం చిరుజల్లులు కురిశాయి. వర్షాల కోసం జిల్లాలో రైతులు నిరీక్షిస్తుండగా కొద్దిపాటి వర్షం ఉపశమనం కలిగించింది. జిల్లాలో అత్యధికంగా ఇల్లంత కుంటలో 6.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. రుద్రంగిలో 3.0, చందుర్తిలో 0.8, వేములవాడ రూరల్‌లో 0.9, బోయినపల్లిలో 2.9, వేములవాడలో 0.7, సిరిసిల్లలో 5.3, కోనరావుపేటలో 0.4, వీర్నపల్లిలో 1.4, ఎల్లారెడ్డిపేటలో 2.0, గంభీరావుపేటలో 0.8, ముస్తాబాద్‌లో 1.3, తంగళ్లపల్లి మండలంలో 5.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 101.2 మిల్లీమీటర్లు కాగా.. ఇప్పటి వరకు 33.5 మిల్లీమీటర్లు నమోదైంది.

దత్తాలయంలో గిరి ప్రదక్షిణ



బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గుట్టపై దత్తాత్రేయ స్వామి ఆలయంలో అమవాస్య సందర్భంగా బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సుమారు 200 మంది భక్తులు గిరిప్రదక్షిణ చేసి స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ భక్త బృందం వారు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముస్తాబాద్: రైతు భరోసాతో రైతుల కుటుంబాల్లో వెలుగులు నిండాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా మోహినికుంట, మద్దికుంటలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. రైతు సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మెరుగు యాదగిరి గౌడ్, సతీశ్ గౌడ్, గజ్జెల రాజు, శ్రీనివాస్‌గౌడ్, భాను, నరేశ్, బాల్‌రెడ్డి, శంకర్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

బోయినపల్లి: మాన్వాడ మానేరు నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తుండగా బుధవారం వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ బోయినపల్లి ఎస్సై రాజకుమార్, పీఎస్సై అనిల్‌తో కలిసి మానేరు వాగును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం తహసీల్దార్ జారీ చేసిన వే బిల్లులను.. ఇసుక తరలింపు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఇసుక సరఫరా చేసే వారితో మాట్లాడుతూ అధికారులు అనుమతించిన సమయంలోనే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలించాలన్నారు. అనుమతి లేని సమయంలో వాగులోకి ఇసుక కోసం వెళ్తే, ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని యజమానులను హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనే ఉపేక్షించేది లేదని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఈత, తాటి మొక్కలు ధ్వంసం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లో గౌడ సంఘం సభ్యులు నాటిన ఈత, తాటి వనాన్ని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ధ్వంసం చేయడంతో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొన్నేళ్ల క్రితం గౌడ సంఘం సభ్యులు నాటిన ఈత, తాటి వనాన్ని పెంచుతున్నారు. అయితే ఈత వనంలో తనకు చెందిన భూమి కొంత ఉందని, అందుకే తన భూమిలో నాటిన వనాన్ని ధ్వంసం చేసినట్లు గురిజాల అనిల్‌రెడ్డి తెలిపాడు. అనిల్‌రెడ్డి, గౌడ సంఘం సభ్యుల మధ్య కొంతకాలంగా భూవివాదం జరుగుతుండగా కోర్టులో పెండింగ్‌లో ఉంది. గతంలో పోలీసులు విచారణ కూడా చేపట్టారు. ఈత, తాటి మొక్కలను ధ్వంసం చేయడంపై ఎక్సైజ్ అధికారులకు గౌడ సంఘం సభ్యులు ఫిర్యాదు చేయగా అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి అనిల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

జోగాపూర్ ఆర్‌ఎంపీపై కేసు

సాక్షి ఎఫెక్ట్..

చందుర్తి: తేలు కుట్టిన బాలికకు నిర్లక్ష్యంగా వైద్యం చేసిన ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. బుధవారం సాక్షిలో 'ఆర్‌ఎంపీ నిర్వాకం ప్రాణపాయ స్థితిలో బాలిక' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం కాగా పోలీసులు స్పందించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టంపేటకు చెందిన కుదురుక సరిత -రమేశ్ దంపతుల కూతురు మహాలకు ఈనెల 19న పత్తి చేనులో తేలు కుట్టింది. జోగాపూర్ ఆర్‌ఎంపీ సంజీవ్ ఇంజెక్షన్ వేయడంతో బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లిందని బాధితురాలు తల్లి సరిత ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో వెంటిలేటర్‌పై వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా వైద్యం చేసిన ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. విద్యార్హతలతో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆహ్లాదం అందనంత దూరం !



● ఇది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దెచెరువు. మినీట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వంలో రూ.3కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ చెరువులోకి దిగేందుకు మెట్లు మాత్రమే నిర్మించారు. చెరువుకట్టపై ప్రజలు కూర్చునేందుకు బెంచీలు, చల్లదనం పంచేందుకు చెట్లు, కట్ట అందంగా కనిపించేందుకు పూల మొక్కలు, ఇతర డిజైన్లు నిర్మించాల్సిన కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండి కంపు కొడుతున్నాయి.

- అర్ధంతరంగా నిలిచిన సుందరీకరణ పనులు
- బోసిపోయి కనిపిస్తున్న చెరువు కట్టలు
- బెంచీలు వేసి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్లు
- ప్రభుత్వం మారడంతో పనుల పూర్తిపై అయోమయం
- మినీ ట్యాంక్‌బండ్ పనులు హుళక్కేనా !



ఇది గంభీరావుపేట మండల కేంద్రంలోని నమాజ్‌చెరువు. ఇక్కడ మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కట్టపై మట్టి పోసి వదిలేశాడు. సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. బెంచీలు లేవు, చల్లని నీడనిచ్చే చెట్లు లేవు. పూర్తి నిధులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే చేతులు ఎత్తేశాడు.

ఎల్లారెడ్డిపేట: చెరువు కట్టల సుందరీకరణ, ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేశారు. పూర్తిస్థాయిలో నిధులు మంజూరుకాకపోవడం ప్రధాన కారణం కాగా.. అధికారుల పర్యవేక్షణలోపంతో ప్రజలకు ఆహ్లాదం కరువైంది. ఎల్లారెడ్డిపేట గిద్దెచెరువు, గంభీరావుపేట నమాజ్‌చెరువు, ముస్తాబాద్ పెద్దచెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిషన్ భగీరథ పథకంలో నుంచి ఒక్కో చెరువు అభివృద్ధికి రూ.3.50కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు కేటాయించింది. పూర్తి స్థాయిలో నిధులు మంజూరుకాకపోవడంతో వచ్చిన డబ్బులతోనే కాంట్రాక్టర్లు పనులు చేసి చేతులు దులుపుకున్నారు.

సుందరీకరణ పనులు ఇలా..

చెరువుల సుందరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రాజన్నసిరిసిల్లలోని నాలుగు చెరువులను ఎంపిక చేసింది. ఆయా చెరువుల కట్టలను బలోపేతం చేయడం, కట్టలపై ప్రజలు కూర్చునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేయడం, చల్లని గాలి వచ్చేలా చెట్లను పెంచడం, పూలమొక్కలను ఏర్పాటు చేయడం, ఆడపడుచులు బతుకమ్మలు వేసేందుకు చెరువులోకి దిగే వీలుగా ఉండేందుకు మెట్లు నిర్మించడం, చెరువుకట్ట ఇరువైపులా రక్షణగా స్టీల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రతీ చెరువులో బోటింగ్‌ను ఏర్పాటు చేయాలి.

బోసిపోయిన చెరువులు

చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా మార్చి ప్రజలు ఆహ్లాదంగా సేద తీరేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్న ప్రభుత్వ సంకల్పం నీరుగారిపోయింది. అనుకున్న లక్ష్యం ప్రకారం రెండేళ్లలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని నిర్ణయించగా.. ఎక్కడ కూడా పనులు పూర్తయిన దాఖలాలు లేవు. ఉదాహరణకు.. గంభీరావుపేట నమాజ్ చెరువు పనుల్లో చెరువుకట్టపై సైడ్‌బర్మ్స్ నిర్మించి వదిలేశారు. కట్టపై కనీసం సీసీ రోడ్డు వేయలేదు. బతుకమ్మ ఘాట్లు నిర్మించి చేతులు దులుపుకున్నారు. ముస్తాబాద్ పెద్దచెరువు వద్ద కట్టపై బెంచీలు వేశారు. సీసీ వేయగా.. ఆరు నెలల్లోపే నాణ్యత లోపంతో పగుళ్లు చూపింది. ఇక్కడ కూడా సగం పనులు చేసి వదిలేశారు. ఎల్లారెడ్డిపేటలోని గిద్దెచెరువు సుందరీకరణలో కట్టపై కొంత దూరం రక్షణగా స్టీల్ ఫెన్సింగ్ వేశారు. బతుకమ్మలే వేయడానికి మహిళలు చెరువులో దిగడానికి మెట్లు, పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో మంజూరు చేయని కారణంగానే సుందరీకరణ పనులు పూర్తికాలేదని కాంట్రాక్టర్‌ల మాట. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఇప్పుడిప్పుడే పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఆహ్లాదంపై ప్రజలు పెంచుకున్న ఆశలు ఆవిరయ్యాయి.

పనులు పూర్తి చేయాలి



ఏళ్ల తరబడి ట్యాంక్‌బండ్ పనులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ప్రజలకు ఆహ్లాదం పంచడంతోపాటు చెరువుకట్ట బలోపేతానికి చేపట్టిన చర్యలు గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా ఉన్నాయి. కొత్త ప్రభుత్వమైనా స్పందించి పనులు పూర్తి చేయాలి.

– దోసల చంద్రం, గంభీరావుపేట

నిధులు మంజూరు చేయాలి



ఎల్లారెడ్డిపేటలోని గిద్దెచెరువును సుందరీకరించడానికి గత ప్రభుత్వం రూ.3 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేసింది. ని ధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశారు. కొత్త ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మిగి లిన పనులను పూర్తి చేయించాలి. మినీ ట్యాంక్‌బండ్‌ను మండల ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– బందారపు బాల్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట

పరిశీలించి పనులు పూర్తి చేస్తాం

జిల్లాలోని మినీ ట్యాంక్‌బండ్‌లుగా మార్చడానికి ఎంపిక చేసిన చెరువులను పరిశీలించి, మిగిలిన పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. గతంలో మంజూరైన నిధులు ఖర్చు చేసి పనులు చేపట్టాం. మిగిలిన పనులకు నిధుల అంచనాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

– సత్యనారాయణ, నీటిపారుదలశాఖ, డీఈ

వ్యాపారులందరిని రైతుబజార్‌కు తరలించాలి



కలెక్టరేట్‌లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు

సిరిసిల్లఅర్బన్: రైతుబజార్‌కు చేపలమార్కెట్‌నే కాకుండా మటన్, చికెన్, కూరగాయాల వ్యాపారులను సైతం తరలించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాజనర్సయ్య మాట్లాడారు. పట్టణ శివారులోని రైతుబజార్‌కు చేపల మార్కెట్‌ను మాత్రమే తరలించ డం ద్వారా అక్కడికి వినియోగదారులు రావడం లేదన్నారు. అన్నిరకాల వ్యాపారాలను రైతుబజార్‌కు తరలిస్తే వినియోగదారులే అక్కడికే వస్తారని.. అప్పుడు అందరికీ వ్యాపారాలు జరుగుతా యన్నారు. ఈమేరకు కలెక్టర్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు.

రైతులను ఆదుకున్నది బీఆర్‌ఎస్సే

ముస్తాబాద్: రైతులకు అన్ని విధాలా అండగా ఉన్నది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్ అన్నారు. ముస్తాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను ఖండించారు. కేటీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారన్నారు. పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, దబ్బెడ రాజు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న లక్ష్మీ నర్సింహారావు

వేములవాడ: యువత క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఐబీపీ గ్యాస్ గోదాం మైదానంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దన్నారు. మూడు రోజులపాటు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, కొండ కనుకయ్య, అంజద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గిరిజనుడి మృతి



మంగ్యానాయక్ (ఫైల్)

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామానికి చెందిన గిరిజన రైతు బట్టు మంగ్యనాయక్ బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. గత నాలుగేళ్లుగా ఇంటి భూమి హద్దుల, పొలం వద్ద కూడా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. అంతేకాకుండా ఇటీవల బోరుమోటార్ సైతం కాలిపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. బుధవారం అస్వస్థతకు గురికాగా 108 వాహనంలో ఎల్లారెడ్డిపేటకు తరలిస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి సీపీఆర్ చేసినా ప్రాణం దక్కలేదు.

ఆరోగ్య పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి రజిత

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారిణి రజిత సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం వైద్య సిబ్బందితో వైద్యసేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ సంపత్‌కుమార్, డీఐవో సారియా అంజుమ్, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో బాలచంద్రం పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకుంటాం

సాక్షి ఎఫెక్ట్..

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సురేశ్ అన్నారు. బుధవారం «ట్రాక్టర్ ఇసుకకు 5 వేలు» అనే శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సరఫరా చేస్తున్న ఇసుకను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవన్నారు. పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు సరఫరా చేస్తున్న ఇసుక వివరాలను తమకు అందజేయాలని కోరారు. ఇక ముందు లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

● **అదనపు కట్నం కోసం వేధించిన ముగ్గురిపై కేసు**

ఎల్లారెడ్డిపేట: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై పోలీసుల కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన పల్లపు స్వాతికి సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండకు చెందిన పల్లపు రాజుతో ఐదేళ్ల క్రితం కట్న కానుకలిచ్చి వివాహం జరిపించారు. కొన్నేళ్లుగా అదనపు కట్నం తీసుకురావాలని భర్త రాజు, అత్త పద్మ, మామ మల్లయ్య వేధిస్తున్నారు. దీంతో స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మరొకరిపై ..

అదనపు వరకట్నం కోసం వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని బండలింగంపల్లికి చెందిన సాకలి భవానికి ముస్తాబాద్‌కు చెందిన సాకలి మహేశ్‌తో 2019లో వివాహమైంది. ఆ సమయంలో వరకట్నం కింద 3 తులాల బంగారం, రూ.1.50లక్షల నగదు, ఇతర లాంఛనాలు ఇచ్చారు. గతేడాదిగా అదనంగా రూ.లక్ష కట్నం తేవాలని కోరుతూ భవానిని ఆమె భర్త మహేశ్ వేధింపులకు గురిచేస్తున్నాడు. తీవ్ర మనోవేదనకు గురైన భవాని ఎల్లారెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **క్షుద్ర పూజలు కలకలం**

సంక్షిప్త వార్తలు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని సీతారాంబజార్ ఏరియాలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమూహంలో బుధవారం క్షుద్రపూజలు కలకలం రేపింది. నిమ్మకాయలు, పసుపు, కుంకుమలు ఆరో బ్లాక్ దగ్గర పడి ఉన్నాయి. అమావాస్య రోజు కావడంతో ఎవరో క్షుద్రపూజలు చేసినట్లు డబుల్ బెడ్ రూం ఇళ్ల వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై భయాందోళనకు గురవుతున్నారు.

● **మంత్రి పొన్నంను కలిసిన నాయకులు**

ఎల్లారెడ్డిపేట: మండలంలో కొత్త రోడ్లను మంజూరు చేస్తూ పాత రోడ్ల మరమ్మతుకు నిధులు విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ పడిగెల రవీందర్ తదితరులున్నారు.

● **బాధిత కుటుంబానికి పరామర్శ**

వేములవాడరూరల్ : వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొర్రె మైసయ్య కు చెందిన ఇల్లు దగ్ధంకాగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు బుధవారం పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందించారు. ఇక్కడ సీనియర్ నాయకుడు రామతీర్థపు రాజు, ఏశ తిరుపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, గోస్కుల రవి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● **విద్యార్థులకు మెమోలు అందజేత**

సిరిసిల్ల అర్బన్ : లోయర్ గ్రేడ్, హయ్యర్‌గ్రేడ్ డ్రాయింగ్‌లో ఉత్తీర్ణులైన 50 మంది విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద బుధవారం మెమోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షలు రాయడానికి కేవలం 8వ తరగతి విద్యార్థులే కాకుండా డిగ్రీ, పీజీ వరకు చదివే విద్యార్థులు కూడా అర్హులు అన్నారు. కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ రుద్ర రమేశ్, ఎలగొండ రవి, తదితరులు పాల్గొన్నారు.

● **మొక్కలు నాటిన నాయకులు**

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బైరగోని సురేశ్ గౌడ్, తూటి దేవేందర్‌రావు, ఓరుగంటి శంకర్, వీరబోయిన తిరుపతి, తాళ్లపెల్లి శేఖర్, లంబ వేణు, నాయకులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరింది. అప్పటి కరీంనగర్ ఎంపీ సీహెచ్ విద్యసాగర్‌రావు తన నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేసి బస్ షెల్టర్ నిర్మించారు. సంస్థ నుంచి కనీసం నిర్వహణ కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు. నేడు కూలిపోయే స్థితిలో ఉన్న బస్ షెల్టర్‌ను మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కిషన్‌రావు, డీఎం, సిరిసిల్ల: సెల్ నంబర్: 9959 225 929

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



బోయినపల్లి: విద్యార్థినికి బహుమతి అందిస్తున్న పోలీసులు



కోనరావుపేట : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, ఎస్సై ప్రశాంత్ రెడ్డి

వేములవాడరూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ...విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

బోయినపల్లి : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన వారోత్సవల సందర్భంగా బోయినపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులకు బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఎస్సై ఎస్. రాజకుమార్, పీఎస్సై అనిల్, తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల అర్బన్ : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్సై మురళీధర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని గీతానగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

ఇల్లంతకుంట: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. ఇల్లంతకుంట మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం ప్రేమలత, ఎస్సై అశోక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన మండలంలోని స్తంభంపల్లి హైస్కూల్ హెచ్‌ఎం, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చంద్ర ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ చెన్నమాధవుని రామరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి సన్మానించారు. మెరిట్ సాధించిన బొంగాని సాత్విక, ముత్యాల మధుమితలను మెమెంటోలతో సత్కరించారు.

కోనరావుపేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రాజేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్సై ఎల్లయ్య గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

ఫ్లెక్సీలతో విన్నపం



దుకాణాల ముందు ఫ్లెక్సీలు కట్టుకున్న యజమానులు

వేములవాడ: రోడ్ల విస్తరణలో తమ దుకాణాలు కూలగొడుతున్న తరుణంలో కోర్టును ఆశ్రయించిన పలువురు యజమానులు తమ షాపుల ఎదుట విజ్ఞప్తి పేరుతో ఫ్లెక్సీలను బుధవారం ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు వాటిని తొలగింపజేశారు. ఫ్లెక్సీలో ఇలా ఉంది. విజ్ఞప్తి... మేము అభివృద్ధిని అడ్డుకోవడం లేదు. హైకోర్టు స్టే ఉన్నా దుకాణాలను కూల్చడం ఎంత వరకు న్యాయం. భూసేకరణ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న వ్యవహారాన్ని ప్రశ్నించడం తప్పా? ఆస్తుల విలువను ఇష్టానుసారంగా కుదించడం కరెక్టా? గుడిచెరువును ఆక్రమించుకుని నేటికీ ఎలాంటి పనులు చేపట్టకపోడం సరైందా? అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారు. రెండో బ్రిడ్జి ఎందుకు పూర్తి చేస్తలేరు. యాత్రికుల కనీస సౌకర్యాలు ఎందుకు కల్పించడం లేదంటూ.. మెయిన్‌రోడ్డు భూసేకరణ నిర్వాసితులు అని ఫ్లెక్సీలో పేర్కొన్నారు.

నోటీసుల జారీతో నిర్మాణాలు కూల్చివేత

ఇల్లంతకుంట: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డు ఎస్సీ కాలనీలో ఇంటి యజమానులకు నోటీసులు అందించడంతో నిర్మాణాలు కూల్చివేస్తున్నారు. ఎస్సీ కాలనీనుంచి వివేకానంద చౌరస్తా వరకు రోడ్డును ఆనుకొని డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ.50 లక్షలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పనులు ప్రారంభించారు. డివైడర్ నుంచి 25 ఫీట్లవరకు సెట్‌బ్యాక్ కోసం గతనెలలో పంచాయతీ అధికారులు ఇంటి యజమానులకు నోటీసులు జారీచేశారు. ఎవరూ స్పందించకపోవడంతో మంగళవారం సిబ్బంది మరోసారి నోటీసులు జారీచేశారు. దీంతో బైపాస్ రోడ్డు పక్కన నోటీసులు అందుకున్న పలువురు నిర్మాణాలను తొలగిస్తున్నారు. కాసుపాక నరసింహులు తన ఇంటి ప్రహరీని కూల్చివేశారు. వివేకానంద చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ సెట్‌బ్యాక్ కోసం మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్‌కు నోటీసులు అందజేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంఈవో శ్రీనివాస గౌడ్ తెలిపారు.



ప్రహరీ కూల్చివేస్తున్న ఇంటి యజమాని

● **కొండ చిలువ హతం**

ముస్తాబాద్: మొర్రాయిపల్లెలో కొండ చిలువను గొర్రెల కాపరులు హతమార్చారు. కుర్మ బాలయ్యకు చెందిన గొర్రెల మంద గ్రామ శివారులో ఉండగా, బుధవారం గొర్రెల మందవద్దకు కొండ చిలువ రావడాన్ని గమనించాడు. చుట్టుపక్కల వారు గమనించి కొండ చిలువను హతమార్చారు.